సాక్షి అనకాపల్లి

ఆదివారం। 17। ఆగస్టు। 2025

కృష్ణం వందే జగద్గురుం

జగన్నాథుడు బాలకృష్ణునిగా అవతరించిన వేళ జగమంతా జేజేలు పలికింది.. జన్మాష్టమి వేడుకలను జిల్లాలో ఘనంగా జరిపారు. ఆలయాల్లో ఘనంగా పూజలు జరిపి కృష్ణుడికి ఊయలసేవలు, ఉట్టి సంబరాలు వైభవంగా జరిపారు.


పాయకరావుపేటలో చిన్నికృష్ణుల ఉట్టి సంబరం


కశింకోట : కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారుల నృత్య నివేదన

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కొటాన రాము(పెందుర్తి)ను, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శిగా బొబ్బిలి లక్ష్మణ్(పాడేరు)ను నియమించారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

భావితరాలకు స్ఫూర్తి గౌతు లచ్చన్న


గౌతులచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి : స్వాతంత్య్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న భావితరాలకు స్ఫూర్తినిచ్చిన మహనీయుడు అని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి తరానికి సర్దార్ గౌతు లచ్చన్న లాంటి మహనీయుల జీవిత చరిత్రలు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. తను నమ్మిన సిద్ధాంతం కోసం ఎక్కడా రాజీ పడకుండా జీవితాంతం పోరాటం చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడి అందరికీ మార్గదర్శకులుగా నిలిచారని ఆమె చెప్పారు. 1978 లోనే చట్టసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారని, పీఏసీ చైర్మన్‌గా, మంత్రిగా, ప్రజా నాయకుడిగా విశేష సేవలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి కె. శ్రీదేవి, సహాయ వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారి వి.గోపి సాధూరావు పాల్గొన్నారు.

పెరిగిన కోనాం నీటిమట్టం


- భారీగా వస్తున్న ఇన్‌ఫ్లో
- 96.20 మీటర్లు వద్ద జలాశయం నీటిమట్టం


కోనాం జలాశయం

చీడికాడ : కోనాం జలాశయం నీటిమట్టం ఒక్క రోజులో మీటరు పెరిగి శనివారం నాటికి 96.20 మీటర్లు వద్దకు చేరుకుంది. శుక్రవారం జలాశయం పరిధిలో నమోదైన 6 ఎం.ఎం వర్షపాతంతో 940 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఒక్కరోజులో జలాశయం నీటిమట్టం 95.20 మీటరు నుంచి మీటరు పెరిగింది. ప్రస్తుతం ఎగువ,దిగువ కాలువల ద్వారా 140 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలౌతుంది. కాగా జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు.

పెద్దేరుకు వరద తాకిడి..

300 క్యూసెక్కుల నీరు విడుదల


గేట్లు ద్వారా విడుదలవుతున్న నీరు

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాలకు పెద్దేరు జలాశయంలో నీటి మట్టం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో జలాయశం గేట్ల ద్వారా శనివారం రాత్రి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయం పరిసరాల్లో 6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. కురుస్తున్న వర్షాలకు జలాశయం నీటిమట్టం 136.40 మీటర్లకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 137 మీటర్లు, వర్షాలకు జలాశయంలోకి 550 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుందని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. జలాశయంలో పెరుగుతున్న నీటి మట్టంను దృష్టిలో పెట్టుకుని, నీటిని విడుదల చేస్తున్నట్టు, జలాశయం పరివాహక గ్రామాలు ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అసలు దోషి ఎవరు?



- వసూలు చేసింది రూ.2 లక్షలు
- ఎస్ఐ వద్ద పట్టుకుంది రూ.50 వేలే...
- రూ.లక్షన్నర ఎవరు జేబులోకి వెళ్లింది?
- విచారణ చేస్తున్న ఏసీబీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

అవినీతి కథలో అసలు దొంగలు తప్పించుకున్నారా? మొత్తంగా వసూలు చేసిన రెండు లక్షల్లో పట్టుకుంది రూ.50 వేలేనా..? మిగిలిన రూ.లక్షన్నర అప్పటికే వేరే వాళ్ల జేబులోకి వెళ్లిపోయిందా? అయితే ఎవరి జేబులోకి వెళ్లిందనే కోణంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు విచారణ చేస్తున్నట్టు తెలుస్తోంది. తెలివిగా ఎస్ఐను ఇరికించి తప్పించుకున్న అసలు దోషిని తేల్చే పనిలో ఏసీబీ అధికారులు పడినట్టు సమాచారం. వాస్తవానికి అనకాపల్లిలో ఒక కేసు విషయంలో రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఎస్ఐ దాసరి ఈశ్వరరావును ఈ నెల 14వ తేదీన ఎస్ఐను ఏసీబీ అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో అసలు దోషి మాత్రం తెలివిగా దొరకకుండా తప్పించుకున్నట్టు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. మొత్తంగా సదరు బాధితుడి నుంచి రూ. 2 లక్షల మేర వసూలు చేసినట్టు విచారణలో తేలినట్టు సమాచారం. అంతకు ముందు నేరుగా స్టేషన్‌లోనే రూ.లక్షన్నర తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ రూ.లక్షన్నర ఎవరు తీసుకున్నారు? ఎవరికి అప్పగించారు అనే కోణంలో లోతుగా ఏసీబీ అధికారులు విచారణ చేపట్టినట్టు సమాచారం.

‘విజయ’వంతంగా చక్రం తిప్పిందెవరు...?

వాస్తవానికి గత ఏడేనిమిదేళ్లగా అనకాపల్లి ప్రాంతంలోనే ఎస్ఐ ఈశ్వరరావు విధులు నిర్వర్తిస్తున్నారు. కశింకోట, అనకాపల్లి రూరల్, సీసీఎస్ తదితర పోస్టింగులు నిర్వర్తించారు. గత ఏడాది కాలంగా అనకాపల్లి టౌన్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆయనపై గతంలో ఎన్నడూ ఈ తరహా భారీ అవినీతి ఆరోపణలు లేవనే పేరు డిపార్టుమెంటులో ఉంది. ప్రధానంగా టౌన్ స్టేషన్‌కు వచ్చిన తర్వాత ఈ వసూళ్ల ఆరోపణలు మొదలైనట్టు తెలుస్తోంది. అన్ని వ్యవహారాల్లోనూ సదరు ఎస్ఐ ఈశ్వరరావును ముందుపెట్టి వసూళ్లకు దింపి.. ‘విజయ’వంతంగా వ్యవహారం నడిపింది ఎవరనేది తేలాల్సి ఉంది. ఏసీబీ అధికారులు కూడా ఈ కోణంలో ఇప్పటికే విచారణ చేస్తున్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇవేకాకుండా పలు వ్యవహారాల్లో కూడా ఎస్ఐ ద్వారా నడిపించిన వసూళ్ల కథలో అసలు సూత్రధారి కోసం అన్వేషణ కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. రూ.50 వేలు తీసుకుంటూ దొరికిన ఎస్ఐ నుంచి ఈ సమాచారం రాబట్టేందుకు ఏసీబీ అధికారులు ప్రయత్నించినట్టు కూడా ప్రచారం గుప్పుమంటోంది. అంతేకాకుండా సదరు బాధితుడు కూడా గతంలో తాను రూ.లక్షన్నర ముట్టచెప్పినట్టు కూడా ముందుగానే ఏసీబీ అధికారులకు సమాచారం అందించారని కూడా పోలీసుశాఖలో ఇప్పటికే చర్చ జరుగుతోంది. ఈ కోణంలో విచారణ జరిపి అసలు దోషిని పట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నం ముందుకెళ్లకుండా అడ్డుతగులుతున్నారని కూడా పోలీసుశాఖలో వార్తలు గుప్పుమంటున్నాయి.

ఎస్ఐను పావుగా వాడుకుంటూ...!

వాస్తవానికి సదరు స్టేషన్‌లో అసలు వ్యవహారాలు నడిపిస్తున్న వ్యక్తి కాస్తా ఎస్ఐను పావుగా వాడుకుంటున్నట్టు సమాచారం. ప్రిన్సిపల్ ఎస్ఐవి నువ్వేనంటూ వసూళ్లకు దింపినట్టు తెలుస్తోంది.

గతంలో ఇదే ప్రాంతంలో పనిచేసిన సమయంలో ఒక భూమి వ్యవహారంలో తలదూర్చడంతో ఫిర్యాదులు ఎదుర్కొన్న సదరు వ్యక్తినే ఈ లంచాల అవతారంలో కూడా కీలక సూత్రధారిగా ఇప్పటికే ఏసీబీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. అంతేకాకుండా స్థానికంగా అక్రమ మైనింగ్ వ్యవహారంలో కూడా నెలవారీగా భారీగానే వసూళ్లకు దిగినట్టు తెలుస్తోంది. గతంలో పలు ఆరోపణలతో పోస్టింగుకు దూరంగా ఉన్న సదరు వ్యక్తి.. ప్రస్తుతం రెచ్చిపోతున్నట్టు సమాచారం. అందినకాడికి ప్రతీ ఒక్క వ్యవహారంలోనూ మామూళ్లకు తెగబడినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, అత్యంత తెలివిగా నేరుగా రంగంలోకి దిగకుండా ఎవరినో ఒకరిని ముందుకుపెట్టి కథ నడిపిస్తూ.. విజయవంతంగా ముందుకెళుతున్నారనే పేరు ఉంది. ఈ వ్యవహారంలో అదృశ్య శక్తులు ఇప్పటికే అడ్డుతగులుతున్న నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏ విధంగా ముందుకెళతారో? చూడాల్సి ఉంది.

రాయితీ రుణాలు ఎప్పుడిస్తారో...!


ఇంటర్వ్యూలకు బయట హాజరైన లబ్ధిదారులు


లబ్ధిదారుల ఎంపికకు బ్యాంకర్లతో కలిసి ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం(ఫైల్)

- బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఎదురుచూపులు
- ఇంటర్వ్యూలు పూర్తయి 4 నెలలైనా మంజూరు కాని వైనం
- బ్యాంక్‌లకు చేరిన లబ్ధిదారుల జాబితా..?.
- కూటమి నేతల సిఫారసులు ఉన్నవారికేనా..?
- దరఖాస్తుదారుల్లో అయోమయం

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు మంజూరు చేస్తామని ప్రకటించిన బీసీ కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ రుణంతో యూనిట్ ఏర్పాటుతో ఆర్థిక భరోసాను పొందవచ్చునని ఆశపడ్డ లబ్ధిదారులు కార్పొరేషన్ రుణాలు ఎప్పుడు మంజూరవుతాయో తెలియక అయోమయంలో ఉన్నారు. 2024-25 ఏడాదికి బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఈ ఏడాది మార్చి 10 నుండి 25 మార్చి వరకూ ఆన్‌లైన్‌లో దర్ఖాస్తులు స్వీకరించారు. వీరికి ఏప్రిల్ 4న ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం లబ్ధిదారుల ఎంపిక జాబితాను బ్యాంక్ అధికారులకు మండల పరిషత్ అధికారులు పంపించారు. దీంతో దరఖాస్తుదారులు బ్యాంకులను సంప్రదిస్తే యూనిట్ మంజూరు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీ నగదు ఇంకా విడుదల కాలేదని సంబంధిత బ్యాంక్ అధికారులు తెలుపుతున్నట్టు సమాచారం. దీంతో అసలు బీసీ కార్పొరేషన్ రుణాలు ఈ ఏడాది మంజూరవుతాయా అన్నా అనుమానాలు అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది.

కూటమి నేతల సిఫార్సులకే పెద్ద పీట..?

కె.కోటపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఏప్రిల్‌లో ఇంటర్వ్యూలు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు జరిపారు. వాస్తవానికి బ్యాంకులు దరఖాస్తుదారుల్లో బ్యాంక్‌కు రుణాలను సకాలంలో చెల్లించే పరిస్థితి గల వారిని, అర్హులను గుర్తించి మాత్రమే ఎంపిక చేస్తారు. కానీ మండలంలో బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఎవరికి రుణాలు మంజూరు చేయాలో కూటమి నాయకులు అధికారులతో జాబితాలను సిద్ధం చేసి బ్యాంకులకు చేరవేసినట్టు పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇంటర్వ్యూల్లో కూటమి నాయకుల పెత్తనం ఉన్నట్టు తెలియడంతో దరఖాస్తులు చేసిన 645 మందిలో కేవలం 528 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. గ్రామాల్లో గల కూటమి నాయకుల సిఫారసులకే అధికారుల పెద్దపీటను వేయనున్న కారణంగానే వీరు గైర్హాజరయ్యారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో కూడా ఈ కార్పొరేషన్ రుణాల మంజూరు సమయంలో జన్మభూమి కమిటీలదే పెత్తనం ఉండేది. కాగా ఇప్పటికే బ్యాంకులకు వచ్చిన జాబితాలో లబ్ధిదారులకూ ఇంకా రాయితీ రుణాలు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు ఆశగా ఎదురు చూపులు చూస్తున్నారు.

నమ్మకం లేదు...

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేశాను. ఇంటర్వ్యూకి కూడా హాజరయ్యాను. బ్యాంక్‌కు వెళ్లి నా పేరు వచ్చిందో లేదో అని ఆరా తీయగా, ఎంపీడీవో కార్యాలయ అధికారులు లబ్ధిదారుల పేర్లు పంపించాలని చెబుతున్నారు. రాజకీయ సిఫారసుల ఉన్న వారికే రుణాలు అందిస్తే నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుంది. బ్యాంక్‌లకు వచ్చిన పేర్లు గల వారికి కూడా రుణాలు ఇంకా మంజూరు కాలేదు.

-ఎల్.నర్సింగరావు, బీసీ కార్పొరేషన్ దరఖాస్తుదారు

నక్కపల్లిలో మోడల్ పోలీస్‌స్టేషన్

- హెటిరో సీఎస్ఆర్ నిధులు రూ.2.50 కోట్లతో నిర్మాణం
- నేడు హోం మంత్రి, డీజీపీ శంకుస్థాపన


కొత్త పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం

నక్కపల్లి : పారిశ్రామికపరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రం నక్కపల్లిలో ఆధునిక సదుపాయాలతో కూడిన మోడల్‌పోలీస్ స్టేషన్ నిర్మిస్తున్నారు. హెటిరో రసాయన పరిశ్రమ వారు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.2.50 కోట్లు కేటాయించడంతో ఆదివారం హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ గుప్తాలు నూతన పోలీస్‌స్టేషన్ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. జాతీయరహదారి పక్కన ప్రస్తుత పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిని ఆనుకుని పోలీసు నివాస గృహాల సముదాయం ఉండే ప్రదేశంలో ఈ నూతన పోలీస్‌స్టేషన్‌ను నిర్మించనున్నారు. గతంలో ఇక్కడ పోలీస్ సిబ్బంది నివాస గృహాల సముదాయం ఉండేది. ఈ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో కొంత స్థలాన్ని పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు కేటాయించడంతో పెట్రోలు బంకు నిర్మించారు. దాని పక్కనే మరికొంత స్థలం ఉంది. ఈ స్థలంలో ఆధునిక సదుపాయాలతో కూడిన మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి హోంశాఖ నిర్ణయించింది. హెటిరో రసాయన పరిశ్రమ వారు రూ.2.50 కోట్లు భవన నిర్మాణానికి నిధులు సమకూరుస్తున్నారు. గత ప్రభుత్వంలోనే నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌ను సర్కిల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. సీఐ స్థాయి అధికారిని నియమించారు. నక్కపల్లి మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే హెటిరో రసాయన పరిశ్రమ ఏర్పాటయింది. తాజాగా ఏపీఐఐసీ వారు సేకరించిన ఐదువేల ఎకరాల భూముల్లో 2 వేల ఎకరాల్లో రూ. 1800 కోట్లతో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కానుంది. ఈ పార్క్‌లో సుమారు 30కి పైనే బల్క్ డ్రగ్ యూని ట్లు కాబోతున్నాయి. అలాగే మరో 2500 ఎకరాల్లో ఆర్సిలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. ఆదివారం హోం మంత్రి, డీజీపీలు ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని సీఐ కుమార స్వామి తెలిపారు.

విపత్తు నిర్వహణలో అప్రమత్తం అవసరం

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్ (విశాఖ): భారీ వర్షాలు, వరదలు వంటి సహజ విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జీవీఎంసీలోని అన్ని విభాగాలు సిద్ధంగా ఉండాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం సమాచారం ప్రకారం రాష్ట్రంలో మూడు రోజుల పాటు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. నగరంలో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున.. ఇప్పటికే అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాలువలు, మ్యాన్‌హోల్స్, అధికంగా నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించి.. నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ అంతరాయం లేకుండా, నీటి కాలుష్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. జీవీఎంసీ వాహనాలు, జనరేటర్లు, చెట్లు తొలగించే యంత్రాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

కేజీహెచ్‌లో గుండె శస్త్రచికిత్సలు పునఃప్రారంభం

- సాక్షి కథనాలతో ప్రభుత్వంలో కదలిక
- ఏడు నెలల తర్వాత తొలి సర్జరీ విజయవంతం



పేదోడి గుండెకోత పేరిట సాక్షి ప్రచురించిన కథనం


ఓపెన్ హార్ట్ సర్జరీ అనంతరం బోడపాటి మావుళ్లు

డాబాగార్డెన్స్(విశాఖ) : ఎట్టకేలకు పేదోడి గుండెకు భరోసా లభించింది. ఉత్తరాంధ్రలోనే పెద్దాస్పత్రిగా పేరుపొందిన కేజీహెచ్‌లో గుండె శస్త్ర చికిత్సలు పునః ప్రారంభమయ్యాయి. ‘సాక్షి’ వరుస కథనాలతో కూటమి ప్రభుత్వంలో కదలిక వచ్చింది. కార్డియో విభాగంలో పరికరాలు మూలకు చేరి ఏడు నెలలుగా గుండె సంబంధిత సర్జరీలు నిలిచిపోయాయి. దీనిపై ‘సాక్షి’ వరుస కథనాలు ప్రచురించింది. విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ వినూత్న నిరసనలతో కేజీహెచ్‌లో దుర్భర పరిస్థితులపై ప్రభుత్వం కళ్లు తెరిచింది. ఏడు నెలల తర్వాత కేజీహెచ్ కార్డియాలజీ విభాగంలో తొలి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు.

కేజీహెచ్‌పై కూటమి నిర్లక్ష్యం

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల ఆరోగ్య భద్రతకు నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పేద వాడి వైద్యాన్ని గాలికి వదిలేసింది. ఒకవైపు మందుల కొరత వెంటాడుతోంది. గతంలో నెల రోజులకు సరిపడా మందులు ఒకేసారి అందించారు. కానీ ఇపుడు వారం, పది రోజులకు మాత్రమే ఇస్తున్నారు. మరోవైపు ఆస్పత్రుల్లో కీలకమైన పరికరాలు నిర్వహణ లేక మూలకు చేరాయి. వీటి మరమ్మతులకు ప్రభుత్వం పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో పీహెచ్‌సీల్లోనే కాకుండా పెద్దాస్పత్రి కేజీహెచ్‌లో కూడా వైద్య సేవల పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రధానంగా కీలకమైన కార్డియాలజీ విభాగంగా అధునాతన పరికరాలు మూలకు చేరాయి. వీటిని మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో గత ఏడు నెలలుగా గుండె సంబంధిత సర్జరీలు నిలిచిపోయాయి. ఫలితంగా పేద రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి అక్కడ ఫీజులు చెల్లించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు.

సాక్షి వరుస కథనాలతో..


కేజీహెచ్‌లో ఏడు నెలలుగా గుండె శస్త్ర చికిత్సలు నిలిచిపోవడంతో ‘సాక్షి’ పత్రిక వరుస కథనాలను ప్రచురించింది. ఇదే సమయంలో వైఎస్సార్‌సీపీ నేతలు కూడా కేజీహెచ్‌పై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ వినూత్నంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కేజీహెచ్‌కు సాయం చేయాలని కోరుతూ బిక్షాటన చేశారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో ప్రభుత్వం కదలిక మొదలైంది.

ఏడు నెలల తర్వాత తొలి సర్జరీ..

ఏడు నెలల తర్వాత కేజీహెచ్ కార్డియాలజీ విభాగంలో చేపట్టిన సర్జరీ విజయవంతమైంది. శనివారం బోడపాటి మావుళ్లు (70)కు అధునాతన హార్ట్-లంగ్ మెషిన్, టెంపరేచర్ కంట్రోల్ మెషిన్ సహాయంతో ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ మనిత, డాక్టర్ సతీష్, స్టాఫ్ నర్స్ భవాని, ఇతర పారా మెడికల్ సిబ్బందిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, సీఎస్ఆర్ ఎంవో అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ యు.శ్రీహరి, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ అభినందించారు. ఇకపై ఈ అధునాతన మెషిన్ ద్వారా గుండె శస్త్ర చికిత్సలు నిరంతరాయంగా కొనసాగుతాయని సూపరింటెండెంట్ తెలిపారు.

అటవీశాఖకు టేకు సిరులు

- టేకు అమ్మకాలతో భారీ ఆదాయం
- గొలుగొండ కలప డిపోలో టేకుకు డిమాండ్
- ఏడాదిలో ఇప్పటికే రూ.కోటి వరకు అమ్మకాలు



డిపోలో వేలం పాట జరుగుతున్న దృశ్యం (ఫైల్) (ఇన్‌సెట్) గొలుగొండ కలప డిపో

గొలుగొండ : గొలుగొండ కలప డిపో వల్ల అటవీశాఖకు మంచి ఆదాయం వస్తుంది. ప్రతి నెలా 6న జరిగే వేలం పాటలో టేకు అమ్మకాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడా లేని విధంగా అమ్మకాలతో అటవీశాఖకు ఆదాయం సమకూరుతుంది. నాణ్యమైన టేకు చెట్లు ఇక్కడ ఉండడంతో వీటిని వేలం పాటలో దక్కించుకోవడం కోసం వ్యాపారులు, ఇంటి అవసరాలకు వాడే యజమానులు జిల్లా నుండే కాకుండా ఏపీ, తెలంగాణ ప్రాంతాలకు నుంచి రావడం జరుగుతుంది.

నాణ్యమైన టేకు చెట్లు లభ్యం

రాష్ట్రంలో ఎక్కడా లేని టేకు చెట్లు గొలుగొండ కలప డిపోలో లభ్యమవుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రస్తుతం అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నల్లకొండ ప్లాంటేషన్‌లో ఉన్న టేకు చెట్లను అటవీశాఖ నరికించి ఇక్కడ డిపోకు తరలిస్తోంది. 1963 సంవత్సరంలో టేకు ప్లాంటేషన్‌ను అప్పట్లో అటవీశాఖ వేయడం జరిగింది. సుమారుగా 300 ఎకరాల వరకు టేకు ప్లాంటేషన్ వేయగా గడిచిన 5 సంవత్సరాల నుంచి వీటిలో పెద్ద చెట్లను కటింగ్ చేయించి ఇక్కడికి తీసుకురావడం జరుగుతుంది.

ప్రతి నెలా 6న వేలం

నల్లకొండ ప్లాంటేషన్ నుంచి నరికించిన టేకు చెట్లను వాహనాలపై ఇక్కడికి తీసుకువచ్చి వేలంలో అమ్మకాలకు ఉంచుతారు. చెట్లు లాటు నెంబర్, ఎన్ని అడుగులు అనే విషయం ముందుగా పాటదార్లకు చెబుతారు. వేలం పాటకు జిల్లా అటవీశాఖ అధికారి తప్పకుండా హాజరు కావడం డీఎఫ్‌వో ఆధ్వర్యంలో అమ్మకాలు చేస్తుంటారు. అటవీశాఖ అధికారి నిర్ణయించిన ధర కంటే ఎవరు ఎక్కువగా పాట పాడితే వారికి లాటులు అమ్మకాలు చేస్తుంటారు. ప్రతి నెలా 6న జరిగే కార్యక్రమంలో విశాఖ, రాజమండ్రి, విజయవాడ, తెలంగాణ ప్రాంతాల నుంచి ఎక్కువగా పాటదారులు హాజరవుతున్నారు.

రూ.కోటి వరకు ఆదాయం

గడిచిన ఏడాదిలో గొలుగొండ కలప డిపో పరిధిలో కోటి రూపాయల వరకూ టేకు అమ్మకాల ద్వారా అటవీశాఖకు ఆదాయం వచ్చింది. సుమారుగా 60 సంవత్సరాల వయస్సు గల చెట్లు వల్ల చెట్లు అత్యంత సేవ తీరి ఉండడంతో ఈ చెట్లతో తయారు చేసే గృహోపకరణాలు ఎంతో నాణ్యతగా ఉంటాయి. అందుకే ఈ డిపోలో కలపకు అంత డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం వర్షాలు తగ్గితే ప్లాంటేషన్‌లో చెట్లు నరికించే ఏర్పాట్లులో అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ అడుగు చెట్లు వెయ్యి నుంచి 5వేల వరకు ఉంటుంది. మన్యం అల్లూరి జిల్లాలో నల్లకొండ ప్లాంటేషన్ ఉన్నప్పటికీ మొదటి నుంచి ఈ కలప అనకాపల్లి జిల్లా గొలుగొండ కలప డిపోకు తరలిస్తున్నారు. గడిచిన 5 సంవత్సరాల నుంచి ప్రతి ఏటా రికార్డు స్థాయిలో గొలుగొండ కలప డిపో నుండి టేకు, వెదురు అమ్మకాలతో ఈ శాఖకు మంచి ఆదాయం వస్తోంది.

22న సింహాచలంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సింహాచలం :

శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న సింహాచలం కొండపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మూడు బ్యాచ్‌లలో ఈ వ్రతాలు జరుగుతాయి. ఇందులో పాల్గొనదలిచిన మహిళలు తమ ఆధార్ కార్డు నంబర్లతో సింహాచలం కొండపై ఉన్న పీఆర్‌ఓ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో సూచించారు. వ్రతం రోజున కూడా ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు పూజాసామగ్రి, ప్రసాదం ఉచితంగా అందిస్తుందని ఈవో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈనెల 22న లక్ష కుంకుమార్చన, సుప్రభాత సేవ, ఆరాధన సేవలు మినహా మిగతా ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



గౌతు లచ్చన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విత్తనాల పోతురాజు

అనకాపల్లి: స్వాతంత్ర్య పోరాట యోధుడు, మాజీ మంత్రి గౌతు లచ్చన్న ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని శెట్టి బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు విత్తనాల పోతురాజు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం లచ్చన తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. రైతుల కోసం ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకూ 700 కిలో మీటర్ల పాదయాత్ర చేసిన మహనీయుడు లచ్చన్న అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రెడ్డి సన్యాసిరావు, పీత నానాజీ, బత్తిన సూర్యారావు, బొక్క నాగేశ్వరరావు, చప్పడి ఆంజనేయులు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, నాయకులు మాధవరావు, ఎస్.సత్యనారాయణ, మద్దాల బాబు, వై.ఎస్. భద్రం, తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల పట్ల జాగ్రత్తలు అవసరం

మాడుగుల: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పాడి రైతులు తమ పశువుల పట్ల తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ వి.చిట్టినాయుడు సూచించారు. పశువులను పాకల్లో తాళ్లతో గట్టిగా కట్టరాదన్నారు. నీరు ఎక్కువగా ఉండే గుంటలు, చెరువులు, జలాశయాల వద్దకు పశువులు, గొర్రెలు, మేకలను తోలుకెళ్లొద్దని సూచించారు. పశువులను విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉంచాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండే పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లను ఎత్తయిన ప్రదేశాలకు తరలించాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండే పాడి రైతులు తమ గ్రామంలో వీఆర్వో, లేదా పశుసంవర్ధక శాఖ సహాయకుడి దృష్టికి సమస్యను తీసుకెళ్లాలన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తుపాను సమయంలో మరణిస్తే 24 గంటల వ్యవధిలో సమీపంలోని పశు సంవర్ధక శాఖ సహాయకులు లేదా పశువైద్యశాల సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

కూటమి సర్కారు.. మరో వడ్డనకు సిద్ధం

- పీపీపీ పేరుతో ప్రైవేటుకు రోడ్ల అప్పగింత
- పరోక్షంగా టోల్ ఫీజుల వసూలుకు అవకాశం
- ఆందోళనలో పల్లె ప్రజలు



విస్తరించనున్న నర్సీపట్నం-తాళ్ళపాలెం రాష్ట్ర రహదారి

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం మరో వడ్డనకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విద్యుత్, రిజిస్ట్రేషన్ చార్జీల భారం పెంచిన ప్రభుత్వం.. తాజాగా రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వారి బెండు తీయ్యాలని చూస్తోంది. ఇప్పటి వరకు జాతీయ రహదారిపై ప్రయాణించే వారు మాత్రమే టోల్ భారం భరించేవారు. ఇక నుంచి రాష్ట్ర రహదారుల్లో ప్రయాణించే వారిపై కూడా ఈ భారం పడనుంది. తొలి ఎన్డీఏ సర్కార్ దేశంలో ప్రధాన నగరాలను కలుపుతూ జాతీయ రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టింది. క్రమంగా రహదారుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. జాతీయ రహదారుల అభివృద్ధి వ్యయాన్ని ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

తొలుత రవాణా వాహనాలు, కార్ల మీద ఉన్న టోల్ భారం క్రమేపీ సామాన్య ప్రజలపై మోపారు. సరకు రవాణా వాహనాలపై పడే టోల్ భారం పరోక్షంగా ప్రజలపై పడుతుంది. గ్రామీణ బస్సుల్లో ప్రయాణించే వారు టోల్ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. మొత్తంగా ఈ టోల్ భారం ప్రజల నడ్డివిరుస్తుంది.

- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇదే నమూనాను రాష్ట్ర రహదారుల విషయంలో కూడా అమలు చేసేందుకు సిద్ధమవుతుంది. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) పేరుతో రాష్ట్ర రహదారులను ప్రైవేటు పరం చేయనుంది. పీపీపీ విధానంలో రాష్ట్రంలో 11 రాష్ట్ర రహదారులను 2, 4 వరుసల రోడ్లుగా విస్తరించేందుకు ప్రతిపాదించింది. ఇందులో అనకాపల్లి జిల్లాలో 31 కిలో మీటర్ల నర్సీపట్నం-తాళ్ళపాలెం రోడ్డు ఉంది. ఈ రోడ్డును రూ.101 కోట్లతో రెండు వరుసలుగా అభివృద్ధి చేయనున్నారు.

ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే మూడు దశాబ్దాల పాటు కాసులు చెల్లిస్తేనే కాని ప్రయాణించలేని పరిస్థితి ఎదురవుతుంది. దీనిని బట్టి చూస్తే భవిష్యత్తులో గ్రామీణ రోడ్లపై టోల్ గేట్లు పెట్టిన ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఇప్పటి వరకు ప్రశాంతంగా ప్రయాణించిన ప్రజలు భవిష్యత్తులో చెల్లించాల్సిన టోల్ చార్జీలపై ఆందోళన చెందుతున్నారు. రోడ్ల అభివృద్ధి ప్రభుత్వం మాత్రమే చేపట్టాలని ప్రైవేటుకు అప్పగించరాదని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల హామీతో కృష్ణమూర్తి మృతదేహానికి అంత్యక్రియలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల ఐయితంపూడి గ్రామానికి చెందిన ముచ్చకర్ల కృష్ణమూర్తి మృతదేహానికి పోలీసులు హామీతో అంత్యక్రియలు నిర్వహించారు. దొంగతనం కేసులో ఇరికించారని కృష్ణమూర్తి ఈ నెల 4వ తేదీన గడ్డి మందు తాగగా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ 15వ తేదీన మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు కలిసి తన కుమారుడిని దొంగతనం కేసులో అన్యాయంగా ఇరికించడంతో మనస్థాపంతో గడ్డి మందుతాగి మృతి చెందాడని కృష్ణమూర్తి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆగ్రహం చెందారు. బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్ వద్ద కృష్ణమూర్తి మృతదేహంతో శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి ధర్నా చేయడానికి పూనుకోగా పోలీసులు అడ్డుకున్నారు. శనివారం ఉదయం కొత్తకోట, చోడవరం, అనకాపల్లి టౌన్ సీఐలు కోటేశ్వరరావు, అప్పలరాజు, అశోక్ కుమార్‌లు మండల నాయకులతో కలిసి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. కృష్ణమూర్తి బతికుండగా రాసిన లేఖలో ప్రస్తావించిన ఇద్దరు వ్యక్తులకు శిక్ష పడేలా చేయాలని, అలాగే ఇద్దరు పోలీసుల్ని సస్పెండ్ చేయడంతో పాటు వారికి శిక్ష పడేలా చేయాలని, మృతుని కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం అందించాలని మృతుని బంధువులు పోలీసుల్ని డిమాండ్ చేశారు. మృతుడు కృష్ణమూర్తి లెటర్‌లో రాసిన ఐయితంపూడికి చెందిన ఇద్దరు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నామని, ఇద్దరు పోలీసులపై చర్యలకు పై అధికారులకు నివేదిస్తామని, రూ.ఐదు లక్షలు మృతుని కుటుంబానికి పరిహారం అందిస్తామని చర్చల్లో పాల్గొన్న సీఐలు, మండల నాయకులు గేదెల సత్యనారాయణ, దొంకిన అప్పలనాయుడు బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

దీంతో శాంతించిన కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఆందోళనను విరమించారు. ఐయితంపూడిలో కృష్ణమూర్తి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

చెరువులా.. రహదారులా..?



నాతవరంలో రోడ్డుపై వరద నీటిలో రాకపోకలు



ఎ.కె.అగ్రహారం వద్ద రోడ్డుపై నీటిలోనే ప్రయాణం



చమ్మచింత వద్ద నీటిలోంచి వస్తున్న ఎడ్ల బండి



తాండవ-నాతవరం మధ్య రోడ్డుపై వర్షం నీరు

నాతవరం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. నాతవరంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై వరద నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. నాతవరం నుంచి తాండవ రిజర్వాయరుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు సుమారుగా 8 కిలోమీటర్ల పొడవున వరద నీటితో నిండిపోయింది. ఈ నీటిలో నుంచే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఎడ్ల బళ్లపై తరలిస్తున్నారు. వల్సంపేట పంచాయతీ శివారు సింహులు మిల్లి ఎ.ఆగ్రహారం, చమ్మచింత, గంటావారి కొత్తగూడెం, నాతవరం, అంకంరెడ్డి వారి చెరువు ప్రాంతంలో రోడ్డుపై ఉన్న వరద నీటిలోనే నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. వెన్నలపాలెం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద, మర్రిపాలెం పంచాయతీ శివారు మోక్లాంగులపాలెం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. తుని, నర్సీపట్నం మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై, యం.బెన్నవరం, ములగపూడి, డి.యర్రవరం జంక్షన్, గాంధీనగరం ఎ.శరభవరం మన్యపురట్ల జంక్షన్ గన్నవరం మెట్ట వర్షం పడినప్పుడల్లా నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంది. రోడ్లన్నీ బాగు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నాయకులకు క్షేత్ర స్థాయిలో ఈ రోడ్ల దుస్థితిని చూసి మాట్లాడాలని ఆయా గ్రామాల ప్రజలు హితవు పలుకుతున్నారు.

ఏలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం



ఏలేరు కాలువలో పడవపై గాలిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు, సిబ్బంది

కశింకోట : మండలంలోని బంగారయ్యపేట వద్ద ఏలేరు కాలువలో గుర్తు తెలియని మృత దేహాన్ని కనుగొన్నామని సీఐ అల్లు స్వామినాయుడు శుక్రవారం రాత్రి విలేకరులకు తెలిపారు. మొదట అచ్చెర్ల గ్రామం వద్ద మృతదేహం కనిపించిందని, దాన్ని వెలికి తీయడానికి సన్నాహాలు చేస్తుండగా కాలువ ప్రవాహానికి కనిపించకుండా కొట్టుకుపోయిందన్నారు. దీంతో పడవలు, డ్రోన్‌ల సహాయంతో స్థానిక యువకులు, ఎస్ఐ మోనోజ్‌కుమార్, పోలీసు సిబ్బంది సహకారంతో ఎట్టకేలకు బంగారయ్యపేట వద్ద మృతదేహాన్ని గుర్తించామన్నారు. అది కుళ్లిపోయి గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉందన్నారు. బహుశా కేడీ పేట వద్ద గల్లంతైన వ్యక్తిగాని , మరెవరో మృతదేహంగా భావిస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు తమ పోలీసు స్టేషన్‌లో గాని, సెల్ నెంబర్ 9440796088కు గాని సంప్రదించి వివరాలు తెలియజేయాలన్నారు..

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో భారీ చోరీ



వివరాలు సేకరిస్తున్న క్రైం పోలీసులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని ఓ క్వార్టర్‌లో పట్టపగలు భారీ దొంగతనం జరిగింది. హెచ్ఆర్ అధికారి ఎస్. సుందరం కుటుంబం బయటకు వెళ్లిన గంటన్నరలోనే ఈ చోరీ జరిగినట్లు క్రైమ్ పోలీసులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సుందరం దంపతులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి ముందు తలుపు గడియ విరిగి ఉంది. లోపల బీరువా కూడా పగలగొట్టి ఉంది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్రైమ్ పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. దొంగలు బీరువాలో ఉన్న 24 తులాల బంగారు ఆభరణాలను తీసుకెళ్లగా, అదే బీరువాలో ఉన్న మరో 40 తులాల బంగారాన్ని వదిలేయడం పోలీసులను ఆశ్చర్యపరిచింది. క్లూస్ టీం ఘటనా స్థలం నుంచి ఆధారాలు సేకరించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

చోరీల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నప్పటికీ, స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఎవరూ వాటిని ఏర్పాటు చేసుకోవడం లేదని పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు. దొంగతనం జరిగిన తర్వాత బాధపడటం కన్నా ముందు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని సీఐ శ్రీనివాసరావు అన్నారు.

రాయల్స్ విజయం



కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన హనుమ విహారి

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్‌లో భాగంగా వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ ఏడు వికెట్ల తేడాతో సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లయన్స్ జట్టు తొమ్మిది వికెట్లకు 139 పరుగులే చేసింది. ఓపెనర్ అభిషేక్ ఒక పరుగుకే పెవిలియన్ చేరగా.. పవన్ కుమార్(30)తో మరో ఓపెనర్ హానీష్ వీరారెడ్డి కలిసి స్కోర్‌ను 51 పరుగులకు చేర్చారు. కెప్టెన్ రికీబుయ్ ఐదు పరుగులకే వెనుతిరగ్గా వీరారెడ్డి (41) 87 పరుగుల వద్ద ఔటయ్యాడు. సందీప్(10), దుర్గాకుమార్(14), అజయ్ కుమార్(18) రెండంకెల స్కోర్లే చేయగలిగారు. సందీప్ మూడు వికెట్లు తీయగా హనుమ విహారి, అయ్యప్ప, సంతోష్ రెండేసి వికెట్లు పడగొట్టారు. ప్రతిగా రాయల్స్ జట్టు 15 ఓవర్లలోనే ఆటను ముగించేసింది. కెప్టెన్ హనుమ విహారి 62, ప్రసాద్ 21, ప్రణీత్ 44 పరుగులతో రాణించారు. విజయ్ రెండు, దుర్గాకుమార్ ఒక వికెట్ తీశారు.

వారియర్స్ గెలుపు

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన మరో మ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్ విజయం సాధించింది. టాస్ ఓడి కాకినాడ కింగ్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. 4.3 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 22 పరుగులు చేసిన స్థితిలో వరుణుడు రాకతో మ్యాచ్ ఆగింది. ఆటను ఏడు ఓవర్లకు కుదించగా తిరిగి ఇన్నింగ్స్ కొనసాగించిన కింగ్స్ ఏడు వికెట్లు కోల్పోయి 37 పరుగులే చేసింది. మనీష్ 14 పరుగులు చేయగలిగాడు. స్టీఫెన్, తోషిత్ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా వారియర్స్ ఓపెనర్లు జ్ఞానేశ్వర్(15), ప్రశాంత్(25) వికెట్ కోల్పోకుండానే 13 బంతుల్లోనే విజయాన్నందించారు.





బస్సెక్కిన మహిళ.. బేజారైన ఆటో అన్న!

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వచ్చిన వెంటనే ఆటోలకు షాక్ తగిలింది. మహిళలతో బస్సులు రద్దీగా మారగా.. ఆటోలు మాత్రం ప్రయాణికుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. శుక్రవారం వరకు ప్రయాణికులతో వరుస ట్రిప్పులు వేసిన ఆటో డ్రైవర్లు.. శనివారం మాత్రం బేరాలు లేక వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చాపరాయికి పోటెత్తిన పర్యాటకులు

- గెడ్డ పొంగే అవకాశం ఉన్నందున అనుమతించని నిర్వాహకులు
- ముఖ ద్వారం వద్ద కళాకారులతో థింసా నృత్యం చేస్తూ సందడి



సందర్శకులను అనుమతించకపోవడంతో బోసిపోయిన చాపరాయి గెడ్డ



చాపరాయి సందర్శనకు తరలివచ్చిన పర్యాటకులు



గిరిజన వస్త్రధారణలో ఫొటోలు దిగుతున్న సందర్శకులు

డుంబ్రిగుడ: వీకెండ్ కావడంతో సందర్శకులు పోటెత్తారు. చాపరాయి జలవిహారి సందర్శనకు శనివారం భారీగా తరలివచ్చారు. అయితే భారీ వర్షాలకు చాపరాయి గెడ్డ పొంగే అవకాశం ఉన్నందున కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా సందర్శకులను నిర్వాహకులు అనుమతించలేదు. దీంతో వారంతా నిరాశకు గురయ్యారు. చాపరాయి జలవిహారి ప్రాంతంలో ప్రకృతి అందాలను తిలకిస్తూ ఫొటోలు దిగారు. ముఖద్వారం వద్ద స్థానిక థింసా కళాకారులతో కలిసి సందడి చేశారు. కొంత మంది పర్యాటకులు గిరిజన వస్త్రధారణలో ముస్తాబై ఫొటోలు తీసుకున్నారు.

క్లుప్తంగా

పరిశుభ్రతతో ఆరోగ్యం



ఎస్పీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న సీఐ లక్ష్మి, పోలీస్ సిబ్బంది

అనకాపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని ఎస్బీ టి.లక్ష్మి తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు మేరకు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. స్వచ్ఛతే ఆరోగ్యానికి మూలమని, ప్రతి ఒక్కరూ తమ నివాసాలు, కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచే అలవాటు చేసుకోవాలన్నారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం పోలీసుల సామాజిక బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు, గ్లాసు వాడడం వల్ల వివిధ రకాల వ్యాధులు బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులు

అనకాపల్లి: ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు మేరకు ఎస్పీ కార్యాలయంలో గౌతు లచ్చన్న 116వ జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. లచ్చన్న చిత్రపటానికి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఇ. శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాకుండా, ప్రముఖ రాజకీయ నాయకుడని, బడుగు బలహీన వర్గాల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గదర్శకత్వం సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ టి.లక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూలో అవినీతిని అరికట్టండి

అనకాపల్లి: రెవెన్యూ అధికారులపై ఏసీబీ అధికారులు దృష్టి సారించాలని మాజీ మంత్రి, వ్యవసాయదారుల సంఘం చైర్మన్ దాడి వీరభద్రరావు కోరారు. స్థానిక గవరపాలెం వ్యవసాయదారుల సంఘం కార్యాలయంలో శనివారం రైతు సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాశ్వత ప్రాతిపదికపై గ్రోయిన్లు పునఃనిర్మించాలని ప్రభుత్వానికి కోరుతూ రైతులు ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు విల్లూరు రాము, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, కొణతాల శ్రీనివాసరావు, కె.వి సూర్యనారాయణ, కర్రి దివాకర్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 90 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,360	3,460
మూడోరకం	3,100	3,260

అనకాపల్లి సినిమాలు

రాజా	: వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-1	: వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-2	: కింగ్ డమ్
పర్తిసాయి	: మహావతార్ నరసింహం
షిర్డిసాయి	: కూలీ
వెంకటేశ్వర	: హరిహర వీరమల్లు
శ్రీ సత్య	: సోమేశ్వర సులోచన
రామచంద్ర	: వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 21 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5, బీ పాజిటివ్-5, ఓ పాజిటివ్-7, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 326 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 315 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

వర్షాకాలం.. పాముల భయం

- పొలాల్లో రైతులు అప్రమత్తం
- కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలి



తుమ్మపాలలో పొలంలో దమ్ముచేస్తున్న ట్రాక్టర్

అనకాపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు సకాలంలో కురవపోవడం, ఎండలు తీవ్రంగా ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో ఆగస్టులో వర్షాలు కురుస్తున్నాయి. రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు.ఈ సమయంలో పొలాల్లో విష పురుగులు, విషసర్పాలు ఎక్కువగా సంచరిస్తుంటాయి. వారం రోజులు క్రితం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం, మూడు రోజుల క్రితం నుంచి వర్షలు కురవడంతో చెట్ల పొదల్లో, బోరుబావుల్లో దాగి ఉన్న పాములు ఉక్కపోతకు తాళలేక బయటకు వస్తుంటాయి. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండకపోతే అంతే సంగతులు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాము కాటుకు గురికాక తప్పదు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అధిగమించవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు.

అనకాపల్లి మండలంలో ఈ ఏడాది 7 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి పంట వేసేందుకు 12 వేల మంది రైతులు సిద్ధమవుతున్నారు. అయితే వర్షాలు ప్రారంభం అయినప్పటి నుంచి సెప్టెంబర్ వరకూ పాములు, ఇతర విషకీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా పాములు ఎలుకలు, కప్పలను తినేందుకు బయటకు తిరుగుతూ చెట్ల పొదల్లో ఉంటాయి. పొలాల్లో కంది కొయ్యల కింద పాములుదాగి ఉంటాయి. చెద పురుగులను తినడం కోసం వాటి కింద చేరుతాయి. పాము కాటేస్తే ఒంటిపై రెండు లేదు నాలుగు కామా ఆకారపు గుర్తులు పడతాయి. అరగంటలోపు విషం ఒళ్లంతా పాకి నాడి వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. కళ్లు మూతలు పడటం, చేతులు, కాళ్లకు తాత్కాలికంగా పక్షపాతం రావడం, మాట ఆగిపోవడం, నాలుక కురుచి తెలియకపోవడం, వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్త పింజరి కరిచిన బాగం ఉబ్బి తీవ్రంగా నొప్పి కలిగిస్తుంది. అరగంటలో నోరు, చెవుల్లో నుంచి రక్తస్రావం జరుగుతుంది. పాము కాటు వేసి భాగాన్ని ఎక్కువగా కదిలించరాదు. తక్షణమే దగ్గరలో వైద్యులు వద్దకు పాముకాటుకు గురైన వ్యక్తిని తీసుకుని వైద్యం అందించాలి.

జాగ్రత్తలు పాటించాలి...

పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండె పోటు వచ్చే ప్రమాదం ఉంది. పాముకాటు వేయగానే గాయాలపై భాగంలో కట్టుకట్టాలి. దీని వల్ల విషం శరీరానికి పాకకుండా నివారించవచ్చు. ఏ పాము కాటువేసిందో తెలుసుకుని యాంటీ మందులు(విషానికి విరుగుడు) తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు. రైతులు రాత్రిళ్లు పొలాలకు వెళ్లేటప్పుడు కాళ్లకు చెప్పులు, టార్చిలైట్లతో పాటు శబ్దాలు చేసే పరికరాన్ని వెంట తీసుకెళ్లాలి.

మండలంలో 32 పంచాయతీలకుగాను 23 పంచాయతీల్లో వరి పండిస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో ఎగువనుంచి నీటిలో పాములు కొట్టుకుని వచ్చి పొలాల గట్టులు, పచ్చగడ్డిలో ఉంటాయి, పచ్చగడ్డి ఎక్కువగా పెరిగిపోతుంటాయి. పాములు కంటికి కనిపించకుండా ఉంటాయి, అనకాపల్లి మండల పరిధిలో గతేడాది 15 మంది వ్యక్తులు పాముకాటుకు గురయ్యారు. సకాలంలో వైద్య సేవలు పొందడంతో ప్రాణహాని జరగలేదు.

అందుబాటులో పాముకాటు మందులు



మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాము కాటుకు మందులు ఉన్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనులు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. పాము కాటుకు గురైతే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి. ఎటువంటి పరిస్థితుల్లో నాటు వైద్యం పనికిరాదు. పాము కాటుకు గురైన వ్యక్తి శరీరంలో మార్పులు రాకుండా చూసుకోవాలి.

– వాణీజగదీశ్వరి, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు, అనకాపల్లి మండలం

పాముకాటుకు గురై వైద్యం పొందాను



మాది గ్రామం జగన్నాథపురంలో ఎకరా పొలంలో వరి పంట వేశాను. వరి ఎదుగుదలకు వచ్చే సమయంలో నేను, మరో రైతు కలిసి పొలంలోకు వెళ్తున్న సమయంలో రహదారి నుంచి పొలం గట్టుపైకి వచ్చే సమయంలో పాముకాటుకు గురయ్యాను. తక్షణమే స్నేహితుడు సహాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో వైద్యం పొందడంతో ప్రాణహాని తప్పింది. ఇప్పుడు ఆరోగ్యంగా జీవిస్తున్నాను. పొలాల్లోకి వెళ్లే సమయంలో చేతిలో కర్ర ఉంటే చాలా మంచిది.

– ఎం.రమణ, అనకాపల్లి మండలం

ముకుందా.. ముకుందా



మూలపేటలో ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడి ఉత్సవాలు



నర్సింగ్‌రావు పేటలో కృష్ణుడు ఊరేగింపులో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు



హ్యాపీ పాఠశాలలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



విజయరామరాజు పేటలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ ప్రతినిధులు



శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలతో అలరించిన చిన్నారులు



డీఆర్వో సత్యనారాయణ దంపతులను ఆశీర్వదిస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు



కశింకోటలో ఉట్ల సంబరంలో పాల్గొన్న యువకులు



అన్న సమారాధన నిర్వహణ



దర్శించుకుంటున్న భక్తులు

వేడుకగా శ్రీకృష్ణాష్టమి

అనకాపల్లి టౌన్: మండలం, పట్టణ వ్యాప్తంగా శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులతో కృష్ణ మందిరాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలతో అలరించారు. చిన్నారుల అలంకరణ చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. నర్సింగరావుపేటలో కృష్ణుడి ఊరేగింపులో వైఎస్సార్ సీపీ 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విజయరామరాజు పేట శ్రీకృష్ణుని ఆలయంలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముందుగా శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ఠ చేశారు. ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ తొమ్మిది రోజులు పాటు పూజలు నిర్వహిస్తామన్నారు. ఆలయ ప్రతినిధి బొబ్బిలి అప్పారావు, భరినికాల గోవింద, బొబ్బిలి రామారావు, ఆడారి కుమార స్వామి, బీ చిన్నియాదవ్ తదితరులు పాల్గొన్నారు. డైట్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు గోపికల వేషధారణతో నృత్యాలు చేశారు. అనంతరం ఉట్టు కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుఠరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. గౌరీ పంచాయితన దేవాలయంలో రాధాకృష్ణ వేషధారణ పోటీలు, కోలాటం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు కృష్ణుని, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ సునీత, కె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మూలపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ మారుతి యువజన సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రతినిధులు సైతా రమణ, నరేష్, ఉప్పిలి శివసాయి, కోన లక్ష్మణ మాట్లాడుతూ ఆలయంలో ఉదయం, రాత్రి పూజలు తొమ్మిది రోజల పాటు నిర్వహిస్తామన్నారు.

కశింకోట: ఆలయాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్థానిక కోనేరు వద్ద శ్రీకృష్ణుని ఆలయంలో స్వామివారిని పూలమాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భర్నికాన నరసింహమూర్తి, సీఐ గొలగాని అప్పారావు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, మాజీ ఎంపీపీ పంచదార్ల లక్ష్మి, యశోదకృష్ణ యాదవ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు పల్లా రమణ, వైస్ ఎంపీపీ వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు శిష్టి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం కోలాటాలు, తోడపెద్దు సేవ, భజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రీకృష్ణుని విగ్రహాన్ని మేళతాళాలతో బాణసంచా కాలుస్తూ గ్రామ వీధుల్లో ఊరేగించారు. పూసర్ల వీధి, సంతబయల తదితర ప్రాంతాల్లో ఉట్ల సంబరం నిర్వహించారు. అనంతరం కృష్ణుని విగ్రహాన్ని శారదా నదిలో నిమజ్జనం చేశారు. యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు వైఏ రాజు, పంచదార్ల సూరిబాబు, మొల్లి అప్పారావు, పల్లా రమణ, దాకారపు శ్రీనివాసరావు, పుర్రె గోపీ,పల్లా మునిలి అప్పారావు పాల్గొన్నారు.



కశింకోట సంతబయల వద్ద సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ



కశింకోట గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కృష్ణాష్టమి పూజలు

శ్రీకృష్ణునిగా ధ్యాన వేంకటేశ్వరస్వామి: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని శ్రీకృష్ణునిగా అలంకరించారు. ఈ సందర్భంగా విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఇక్కడి లక్ష్మీనృసింహస్వామి, స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని పూలమాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. సంతబయల కొణతాల షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కొణతాల లింగాజి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహం వద్ద ప్రత్యేక హోమం నిర్వహించారు. మహిళలు సామూహికంగా విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. కోలాటాలు నిర్వహించారు. రాత్రి ఉట్ల సంబరం నిర్వహించారు.

కశింకోట: దేవదాయ శాఖకు చెందిన స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో మూల విరాట్‌ను పూలు, తులసీ మాలలతో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. అనంతరం బాలకృష్ణుని విగ్రహాన్ని అలంకరించిన మండపంలో ఊయలపై నిలిపి వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పండ్లు, కాయం, పలు రకాల పిండి వంటలు నివేదించారు. స్వామివారిని జిల్లా రెవెన్యూ అధికారి పి. సత్యనారాయణ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. వారిని ఆలయ మర్యాదలతో వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆశీర్వదించారు. అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి పాల్గొన్నారు.



కశింకోట శ్రీకృష్ణుని ఆలయంలో స్వామివారికి పూజలు



వేంకటేశ్వర ధ్యాన మందిరంలో శ్రీకృష్ణుని అవతారం



వేణుగోపాలస్వామి ఆలయంలో బాల కృష్ణుని విగ్రహానికి పూజలు

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అప్పారావు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, పార్టీ మండలాధ్యక్షుడు అప్పికొండ అప్పారావు, సోషల్ మీడియా నియోజకవర్గ కో– కన్వీనర్ పంచాడ గంగరాజు ప్రధాన కార్యదర్శి ఉప్పలపు చిట్టిబాబు, కార్యదర్శి సిహెచ్. శ్రీనివాసరావు, యువ మో ర్చా మండల అధ్యక్షుడు అప్పలరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ప్రతిభకనబర్చిన విద్యార్థులతో సర్వేశ్వరరావు, బాలకృష్ణ

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి గుంపున సర్వేశ్వరరావు తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డు కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం రాత్రి పట్టణ పరిధిలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, కాకినాడ ఐ బ్యాంక్ అధినేత బాదం బాలకృష్ణతో కలిసి అందజేశారు. 30 మంది విద్యార్థులకు వీటిని అందించారు. 40 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కుల, మతాలకు అతీతంగా ఏటా పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన పార్టీ నాయకుడు



జనసేన పార్టీ నాయకుడు లోవరాజుకు వైఎస్సార్‌సీపీ కండువా వేస్తున్న సచివాలయ సమన్వయకర్త గున్నయ్యనాయుడు

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో జనసేన పార్టీ నాయకుడు గూడుపు లోవరాజు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ మండల సచివాలయ సమన్వయకర్త కలగ గున్నయ్యనాయుడు అతడికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌ల సారథ్యంలో ఎంపీపీ కలగ లక్ష్మి ఆధ్వర్యంలో లోవరాజు పార్టీలో చేరారని, ఇది ఎంతో ఆనందదాయకమని ఈ సందర్భంగా గున్నయ్యనాయుడు అన్నారు. సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు గూడుపు లక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ ఒమ్మి గంగునాయుడు, తీడ సర్పంచ్ సత్తిబాబు, మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, పార్టీ స్థానిక నాయకులు గూడుపు రాజు, బొట్ట నాగఅప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆవలో అక్రమాలపై చర్యలేవీ?

అవఖండం పరిరక్షణ వేదిక కన్వీనర్ భద్రం



మాట్లాడుతున్న భద్రం

అనకాపల్లి: జాతీయ రహదారి అవఖండం భూముల్లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై జిల్లా అధికార యంత్రం చర్యలు చేపట్టాలని అవఖండం పరిరక్షణ వేదిక కన్వీనర్ వైఎస్.భద్రం డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో అవఖండ పరిరక్షణపై శనివారం ఆయన మాట్లాడుతూ అవఖండంలో పర్యావరణ విధ్వంసంపై చీమకుట్టినట్టుగా వ్యవహరించడం అన్యాయమన్నారు. పట్టణంలో వర్షపునీరు అవఖండంలోకి చేరి అక్కడ నుంచి మునగపాక మండలానికి చేరుతుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు విధ్వంసాన్ని నివారించకుండా ఫిర్యాదు చేసిన వ్యక్తులపై తప్పుదోవ పట్టిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నష్టం జరగకముందే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే అనకాపల్లి పట్టణం ముంపునకు గురవుతుందన్నారు. ఆవఖండంలో విధ్వంసంపై బహిరంగంగా చర్చకు రావడంతోపాటు అది కచ్చితంగా నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆవఖండం పరిరక్షణ వేదిక ప్రతినిధులు కనిశెట్టి సురేష్ బాబు, గాడి బాలు పాల్గొన్నారు.